# ప్రజా నాట్యమండలి

ఆధునిక తెలుగు నాటకరంగాన్ని కొత్తమలుపు తిప్పిన మూడు ముఖ్యమైన సంస్థలలో ప్రజానాట్యమండలి ఒకటి: మిగిలినవి ఆంధ్రనాటక కళాపరిషత్తు ఆంధ్రవిశ్వవిద్యాలయ ప్రయోగ రంగస్థలం. చివర పేర్కొన్న రెండు సంస్థలలో ఎక్కువగా పట్టణవాసుల నాటకాభిలాషకు అద్దం పట్టగా, ప్రజానాట్యమండలి మాత్రం పల్లెటూళ్ళు ఆలవాలంగా, పల్లెజీవితాలు నేపథ్యంగా, పీడిత వర్గాల మీద జరిగే అత్యాచారాలకు నిరసనగా తన నాటక ప్రదర్శనలకు రూపుదిద్దింది.

1943 మే 25, 26, 27 తేదీలలో బొంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదల రచయితల సభలో Indian Peoples Theatre Association (IPTA) కు అంకురార్పణ జరిగింది. ఈ IPTAకు ఆంధ్ర శాఖ ప్రజానాట్యమండలి. ఆనాటి ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ, కళ కళకోసం కాదనీ, ప్రజలకోసమేనీ నిరూపించిన నాటకోద్యమం ప్రజానాట్యమండలి.

నృత్య, నాటక, సంగీతాల ద్వారా దేశభక్తిని పెంపొందించడం, సామ్రాజ్యవాద శక్తులను ఎదిరించడం, కర్షక కార్మిక ఐక్యతలకు దోహదం చేయడం ఇవీ ప్రజానాట్యమండలి ముఖ్యోద్దేశాలు. దీనికి గాను వారు ఆంధ్రదేశంలో మారుమూల వున్న జానపద కళారూపాలను ఎన్నుకున్నారు. ఈ కళారూపాల ఎంపికకు, వానిని కళాకారులకు నేర్పడానికి వైజ్ఞానికి శిక్షణా శిబిరాలు ఏర్పడ్డాయి. బొంబాయి సభలో విజయయాత్ర చేసి వచ్చిన వారిలో గరికపాటి రాజారావు, కోగంటి గోపాలకృష్ణయ్య వంటివారి ఆధ్వర్యంలో ఎన్నో కళారూపాలలో శిక్షణ నివ్వడం జరిగింది. రాష్ట్ర దళాలు, జిల్లా దళాలు ఏర్పడ్డాయి. చివరకు గ్రామదళాలు కూడా ఎంతో విజయవంతంగా ప్రదర్శనలిచ్చాయి.

ఈ ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్రదళ కళాకారులు:

డాక్టరు రాజారావు, కోగంటి గోపాలకృష్ణయ్య, షేక్ నాజర్, కోడూరి పున్నయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, సుంకర సత్యనారాయణ, మాచినేని, ఉమామహేశ్వరరావు, సి.మోహన్‌దాస్, వెంపటి, పురుషోత్తం, బి.గోపాలం మొదలయినవారు ఉండేవారు.

రాష్ట్ర, జిల్లా దళాల స్వీకరించిన పునర్నిర్మించిన జానపద కళారూపాలు:

కోయవేషం, బుర్రకథ. హరికథ, చెంచువేషం, వీథిభాగవతం, చెంచీత పాటలు, గొల్ల సుదులు, పిచ్చుకుంటల కథ, డప్పులనృత్యం, జేగంల భాగవతం, పిట్టలదొర, జములకుల కథ, కోలాటం, జంతరు పెట్టె, హరిహరీపదాలు, చెక్క భజన, మూకనాటిక....మొదలైనవి.

రాష్ట్రదళం ఆధ్వర్యంలో జిల్లా, గ్రామ దళాలు తరిఫీదు.

ఈ కళారూపాలను ఆధునికరించి, ప్రజలకు దగ్గరగా పోవడానికి, తమ ముఖ్యమైన సందేశాలనందజేయడానికి ఎన్నో వైజ్ఞానిక, కళా శిబిరాలు నిర్వహించింది ప్రజానాట్యమండలి. ప్రతి శిబిరం పదిహేను రోజుల పాటు నిర్వహించేవారు. ఈ క్యాంపుల్లో స్త్రీల దళాలు కూడా తయారయ్యేవి. క్రమంగా కేవలం కళారూపాలను ప్రదర్శించడంతో ఆగక, నాటక ప్రదర్శన స్థాయికి త్వరలోనే ఎదిగిది ప్రజానాట్యమండలి.

**ప్రదర్శించిన నాటకాలు:**

ప్రజానాట్యమండలి రాష్ట్రదళం ముందడుగు, మా భూమి, అపనింద, పరివర్తన మొదలైన నాటకాలను ప్రదర్శించింది. అందులో మొదటి మూడు నాటకాలను సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావులు కలిసి వ్రాశారు. నాలుగో నాటకం ఆత్రేయ రచన. ఈ నాటకాలన్నీ వేలాది సార్లు ప్రదర్శితమై తెలుగు నాటక చరిత్రలో ఓ నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టాయి.

**ముందడుగు (1945):** సుంకర-వాసిరెడ్డి జంటరచయితలు వ్రాసిన నాటకం. జమీందారీ వ్యవస్థకు అద్దంపట్టే, రైతు కూలీల విప్లవానికి నాంది పలికిన నాటకం. జమీందారుల నిర్దాక్షిణ్య రాజ్యంలో రైతుల, కూలీల అణచివేత, ఈ బాధలను భరించలేకర వారు ఎదురుతిరిగితే జమీందారు పలాయనం. అంతవరకు జమీందారుల పక్షా ఉన్న పెద్ద రైతులందరూ తమ తప్పును గ్రహించి చిన్న రైతుల పక్షాన చేరడం – ఇదీ ఇతివృత్తం. పన్నెండు ప్రదర్శనలకు ఈ నాటకాన్ని ప్రభుత్వం నిషేదించింది.

**మాభూమి (1946):** సుంకర-వాసిరెడ్డిల కలం నుంచి వెలువడిన తెలుగు నాటకరంగం చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని నిర్మించిన నాటకం. నైజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రజాపోరాటమే మా భూమి ఇతివృత్తం. ఈ పోరాటంలో పోలీసు దాడులు 240 గ్రామాల మీద జరగగా, 8000 మందిని అరస్టుచేశారు. 64గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విద్వంస కాండకు, దమననీతికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ప్రతిబింబించినదే మా భూమి నాటకం. 1947లో 125 దళాలు ఒక్క సంవత్సరంలో వేయికి పైగా ప్రదర్శనలివ్వడం, ఆ ప్రదర్శనలను 20 లక్షల మంది తిలకించడం ఒక మహోజ్వల చరిత్ర.

రాజకీయ నాయకులు, పండితులు, కవులు, నాటకకర్తలు ఎందరో మా భూమి నాటకాన్ని తిలకించి పరవశులైనారు. వారిలో విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంత, గిడుగు సీతాపతి, కొప్పరపు సుబ్బారావు వంటి ప్రముఖులెందరో ఉన్నారు.

ఇవి కాక ప్రజానాట్యమండలి ప్రదర్శించిన నాటకాలలో అపనింది (1948), పరివర్తన (1947)

కూడా ఎంతో ప్రఖ్యాతిని పొందాయి.

ఈ నాటకాలలో మా భూమి నాటకాన్ని కూడా ప్రభుత్వం నిషేదించింది.

**వీధిభాగవతాలు:**

ప్రజానాట్యమండలి ప్రదర్శించిన వీధినాటకాల్లో సిమ్లా భాగవతం, హిట్లర్ భాగవతం పేర్కొనదగినవి. ఈ రెంటి రచయిత కోగంటి గోపాలకృష్ణయ్య. అప్పటికే పల్లెల్లో ప్రాచుర్యం పొందిన వీధి భాగవత రూపాన్ని స్వీకరించిన ఆధునిక రాజకీయ చైతన్యాన్ని ప్రతిబింబించే కథావస్తువును దానికి జోడించి వ్రాసిన నాటకాలే ఇవి. ఇందులో శాస్త్రీయమైన వీధిభాగవతాల రూపానికి ఆధునిక కథావస్తువును జోడించడం జరిగింది. ఈ నాటకాలలో జి.రాజారావు, కోడూరు అచ్చయ్య, కోసూరి పున్నయ్య, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ప్రభృతులు పాల్గొన్నారు. సూత్రాధారుడు, ప్రవేశదరువులు, నృత్యం, సంగీతం – వీటన్నింటినీ సమాహారం చేసి వ్రాయబడిన ఈ వీధి భాగవతాలు ఎంతో ఆదరణ పొందాయి.

ప్రజానాట్యమండలి స్వీకరించిన ఇతర కళారూపాలలో ప్రసిద్ధి చెందిన కళాకారులెందరో ఉన్నారు. బుర్రకథ దళాలే నూటికిపైగా ఉండేవి. అందులో నాజర్‌దళం దేశవ్యాప్తంగా అత్యుత్తమ దళంగా పేరు పొందింది. వీరుకాక కాకుమారు సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, మోటూరి ఉదయం, కోటిక సీత, వీరమాచినేని సరోజిని ప్రభృతుల బృందాలు ప్రఖ్యాతిపొందాయి.

1948 జూన్‌లో రాజకీయ కార్యకలాపాలకు తోనవుతున్న నెపంతో ప్రజానాట్యమండలి సభ్యులను జైళ్లకు పంపారు. ఆ నెలలోనే ప్రజానాట్యమండలిని రద్దు చేశారు. కాని మద్రాసులో ఇది కొంతకాలం కొనసాగింది. 1968లో పునర్నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయి కాని విజయవంతం కాలేదు. 1974లో పునరుద్ధరించబడ్డది. కాని 1978లో రాజకీయకారణాల వల్ల ప్రజానాట్యమండలి, ఆంధ్రప్రజానాట్యమండలిగా విడిపోయి ఆ రెండూ ఇప్పుడు పనిచేస్తున్నాయి.

**ప్రజానాట్యమండలి సాధించిన విజయాలు:**

1. రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఉద్యమంగా సాగిన మొట్టమొదటి ప్రయత్నం ప్రజానాట్యమండలి చేసింది. వేలాది కళాకారులకు శిక్షణ నిచ్చి ప్రదర్శన లిచ్చింది. ముఖ్యంగా ఆంధ్రదేశంలో పల్లెపట్టుల్లో ఆ ప్రదర్శనలకు జనం నీరాజనం పట్టారు.
2. పల్లె ప్రజల సమస్యలను సామ్రాజ్యవాద, జమీందారీ విధానాల నేపథ్యంలో చిత్రించిన సంస్థ.
3. సాంప్రదాయిక జానపద కళారూపాలను స్వీకరించి, ఆధునిక రాజకీయ కథావస్తువులను వానికి జోడించి కొత్త కళారూపాలను సృష్టించింది.
4. స్త్రీ కళాకారులను ముందుకు తెచ్చి ఎన్నో దళాలలో వారిని ముఖ్యమైన సభ్యులుగా తీర్చిదిద్దింది.

5. ఆంధ్రనాటకరంగానికి అత్యున్నత కళాకారులను అందించింది.

6. క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్నో శిబిరాలను నిర్వహించి కళాకారులను తయారు చేసింది.

7. బుర్రకథ, జముకుల కథ, గొల్లసుద్దుల వంటి కళారూపాలకు వినూత్నమైన సృజనాత్మకతను రూపొందించింది.

8. వృత్తి నాటక రంగం విచ్ఛిన్నమైన నేపథ్యంలో అటు ఆంధ్ర నాటక కళాపరిషత్తు, ఇటు ప్రజానాట్యమండలి ఉత్తమం నాటకాల ప్రదర్శనకు దోహదం చేసి మరో ఔత్సాహిక నాటకోద్యమానికి స్వీకారం చుట్టాయి.